




# కరపత్రం

SINCE 2014

గురువారం జనవరి 23 2025 | సంపుటి :0 | సంచిక : 102 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు: 4


## దావోస్‌లో ప్రత్యేక ఆకర్షణగా తెలంగాణ పెవిలియన్

### తెలంగాణ మీన్స్ బిజినెస్‘ అనే థీమ్‌తో ఏర్పాటు

**ప్రపంచ ఆర్థిక వేదిక వార్షిక సదస్సులో ఈసారి తెలంగాణ పెవిలియన్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. గతానికి భిన్నంగా ఈసారి ఇండియన్ గ్యాలరీలోనే అన్ని రాష్ట్రాలకు ప్రత్యేక**

పెవిలియన్ కేటాయించారు. 'తెలంగాణ మీన్స్ బిజినెస్‘ అనే థీమ్‌తో ఏర్పాటు చేసిన తెలంగాణ పెవిలియన్ దేశ విదేశాలకు చెందిన పారిశ్రామిక వేత్తలను, నిపుణులను ఆకట్టుకుంది. ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలతో పాటు అందుబాటులో ఉన్న నైపుణ్య వనరులు, తెలంగాణకు ఉన్న అనుకూలతలను చాటిచెప్పేలా ఈ పెవిలియన్‌ను అందంగా తీర్చిదిద్దారు. తెలంగాణలో నైపుణ్యాలకు కొదవ లేదంటూ రాష్ట్ర ప్రభుత్వం స్కిల్ డెవలప్‌మెంట్‌కు ఇచ్చిన ప్రాధాన్యాన్ని చాటుకుంది.



2లో

## నల్గొండలో భారాస రైతు మహాధర్నాకు హైకోర్టు అనుమతి

హైదరాబాద్: భారాస రైతు మహాధర్నాకు తెలంగాణ హైకోర్టు అనుమతిచ్చింది. ఈ నెల 28న నల్గొండ క్లాక్‌టవర్ సెంటర్‌లో రైతు మహాధర్నా నిర్వహించాలని భారాస నిర్ణయించింది. పోలీసు అధికారులు అనుమతి మంజూరు చేయకపోవడంతో భారాస నేతలు హైకోర్టును ఆశ్రయించారు. విచారణ చేపట్టిన ఉన్నత న్యాయస్థానం 28న ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు మహాధర్నా కార్యక్రమానికి అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. మహా ధర్నాలో భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌తో పాటు పలువురు ముఖ్యనేతలు, రైతులు పాల్గొననున్నారు.




## తెలంగాణలో కొనసాగుతున్న పెట్టుబడుల వేట

**రూ.10 వేల కోట్ల పెట్టుబడులకు కంట్రోల్ ఎస్ సంస్థ ప్రతినిధులు సంతకాలు**

**ప్రాజెక్ట్ దాదాపు 3,600 మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగాలు లభిస్తాయని అంచనా**

**తెలంగాణ వృద్ధిలో ఈ డేటా సెంటర్ మరో మైలురాయి : ఐటీశాఖ మంత్రి శ్రీధర్‌బాబు**



హైదరాబాద్,తెలంగాణ ప్రభుత్వం దావోస్‌లో పెట్టుబడుల వేట కొనసాగిస్తోంది. ఇదివరకే యూనిలీవర్, హెచ్‌సీఎల్ లాంటి దిగ్గజ కంపెనీలతో ఒప్పందాలు చేసుకుంది. తాజాగా హైదరాబాద్‌లో ఏఐ డేటా సెంటర్ క్లస్టర్ ఏర్పాటుకు కంట్రోల్ ఎస్ ముందుకొచ్చింది. ప్రపంచ ఆర్థిక సదస్సులో భాగంగా రూ.10 వేల కోట్ల పెట్టుబడులకు ఎంవోయూపై తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబు సమక్షంలో కంట్రోల్ ఎస్ సంస్థ ప్రతినిధులు సంతకాలు చేశారు. తెలంగాణలో అత్యాధునిక డేటాసెంటర్ క్లస్టర్‌ను నెలకొల్పేందుకు కంట్రోల్ ఎస్ డేటా సెంటర్స్ లిమిటెడ్ కంపెనీ అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఈ మేరకు తెలంగాణ బృందంతో భేటీ అనంతరం సంతకం చేసింది. దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక సదస్సులో తెలంగాణ ప్రభుత్వంతో ఈ ఒప్పందం కుదిరింది. ఆర్టిఫిషియల్ డేటా సెంటర్ క్లస్టర్ ఏర్పాటుకు ఈ కంపెనీ రూ. 10,000 కోట్లు పెట్టుబడి పెట్టేందుకు ముందుకొచ్చింది. ఓవరాల్ గా 400 మెగా వాట్ల సామర్థ్యంతో ఈ డేటా సెంటర్ రూపొందనుంది. ఈ ప్రాజెక్ట్ దాదాపు 3,600 మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగాలు లభిస్తాయని తెలంగాణ ప్రతినిధులు అంచనా వేశారు. ఈ సమావేశం అనంతరం మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. తెలంగాణ డిజిటల్ మౌలిక సదుపాయాల అభివృద్ధిలో కంట్రోల్ ఎస్ వారు నెలకొల్పనున్న ఈ డేటా సెంటర్ మరో మైలురాయిగా నిలుస్తుందని అన్నారు. ఐటీ సేవల సామర్థ్యం తెలంగాణలో పెరుగుఉందని, నగరంలో ఉపాధి అవకాశాలు మెరుగుపడుతాయని అన్నారు. డేటా సెంటర్ల ఏర్పాటుతో తెలంగాణ ఐటీ సేవలలో మరింత వృద్ధి సాధిస్తాయని కంట్రోల్ ఎస్ సీఈవో శ్రీధర్ పిన్నపురెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వంతో కలిసి సాంకేతిక అభివృద్ధిలో భాగస్వామ్యం పంచుకోవటంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ ఒప్పందం చేసుకోవడంపై గర్వంగా ఉందన్నారు. యూనిలీవర్ తెలంగాణలో పెట్టుబడులకు ప్రభుత్వంతో చర్చలు జరిపింది. వినియోగ వస్తువుల తయారీలో యూనిలీవర్‌కు మంచి పేరుంది.

## బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాలపై కన్నెత్తి చూసినా ఊరుకోం

**60 లక్షలు మంది సైనికులు ఉన్నా పార్టీ బీఆర్ఎస్ కార్యాలయాలపై దాడి చేసే దరిద్ర్యపు సంస్కృతి కాంగ్రెస్‌ది : కల్వకుంట్ల కవిత**

2లో



## తిరుపతి తొక్కిసలాట ఘటన.. న్యాయవిచారణకు ప్రభుత్వం ఆదేశం

అమరావతి: తిరుపతి తొక్కిసలాట ఘటనపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం న్యాయ విచారణకు ఆదేశించింది. హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ సత్యనారాయణమూర్తి నేతృత్వంలో జ్యుడిషియల్ విచారణకు ఆదేశించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

2లో



## 40 లక్షల మందికి లబ్ధి చేకూర్చేలా కొత్త రేషన్ కార్డులు



నారాయణపూర్: గత ప్రభుత్వం రేషన్ కార్డులపై దృష్టి పెట్టలేదని తెలంగాణ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి విమర్శించారు. 40 లక్షల మందికి లబ్ధి చేకూర్చేలా కొత్త రేషన్ కార్డులు తీసుకొస్తున్నామని చెప్పారు. కరీంనగర్ జిల్లాలోని నారాయణపూర్‌లో నిర్వహించిన గ్రామసభకు ఆయన హాజరై మాట్లాడారు. రేషన్ దుకాణాల్లో ఇక నుంచి సన్న బియ్యం పంపిణీ చేస్తామన్నారు.

వ్యవసాయయోగ్యమైన భూములకు ఏటా ఎకరాకు రూ.12 వేలు ఇస్తామని ఉత్తమ్ తెలిపారు. భూమి లేని వ్యవసాయ కూలీలకు డబ్బులు ఇస్తామన్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టు తీసుకొచ్చేలా చేయడమే తమ విధానమని ఉత్తమ్ చెప్పారు. నారాయణపూర్ ప్రాజెక్టు పూర్తిచేస్తామని ఆయన హామీ ఇచ్చారు. ముంపు గ్రామాల ప్రజలకు సరైన న్యాయం చేస్తామన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందిస్తామని చెప్పారు.

## ఆ ప్లాస్టిక్ సర్జనే కిడ్నీ శస్త్ర చికిత్సలు చేశారా? లేదా అని ఆరా తీస్తున్నాం: డీఎంఈ



హైదరాబాద్: అలకనంద ఆస్పత్రి కిడ్నీ రాకెట్ వ్యవహారంలో నిజానిజాలు తేల్చేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక కమిటీ విచారణ కొనసాగుతోంది. డాక్టర్ నాగేంద్ర నేతృత్వంలోని నలుగురు సభ్యుల కమిటీ.. కిడ్నీ దాతలు, గ్రహీతలతో మాట్లాడుతున్నారు. ఈ కమిటీ ఇవాళ సాయంత్రానికి డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ)కి నివేదిక ఇవ్వనుంది. విచారణ సందర్భంగా డీఎంఈ వాణి మాట్లాడుతూ.. “కిడ్నీ దాతలు పూర్ణిమ అనే మహిళ పేరు ప్రస్తావించారు. కుటుంబ, ఆర్థిక కారణాలతో కిడ్నీలు ఇచ్చేందుకు అంగీకరించినట్టు చెప్పారు. కిడ్నీలు ఇచ్చిన ఇద్దరు మహిళలు కూడా వితంతువులే. కిడ్నీ దాతలు, గ్రహీతలు తమిళం, కన్నడ మాట్లాడుతున్నారు. ఇతర రాష్ట్రాలకి చెందిన వారిని రాష్ట్రానికి తీసుకొచ్చి కిడ్నీ రాకెట్ నిర్వహిస్తున్నారు. అలకనంద ఆస్పత్రికి సంబంధించి ఒక ప్లాస్టిక్ సర్జన్‌కు మాత్రమే గుర్తింపు ఉంది. వాస్తవంగా ఆ ప్లాస్టిక్ సర్జనే ఈ కిడ్నీ శస్త్ర చికిత్సలు చేశారా? లేదా అని ఆరా తీస్తున్నాం. అనుమతి లేకున్నా శస్త్ర చికిత్స చేసిన వైద్యులను కఠినంగా శిక్షిస్తాం” అని హెచ్చరించారు.

## గ్రామసభలను చూస్తే..

### కాంగ్రెస్ ప్రజా పాలన తీరు ఏమిటో తెలిసిపోతోంది : కేటీఆర్


**గత సంవత్సర కాలంగా కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరును దగ్గర నుంచి గమనిస్తున్నట్లు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు.**

**నిన్న, ఇవాళ్టి గ్రామసభలను చూస్తే కాంగ్రెస్ ప్రజాపాలన తీరు ఏమిటో తెలిసిపోతోందని పేర్కొన్నారు.**

**తెలంగాణ భవన్‌లో సత్తుపల్లి మున్సిపాలిటీ బీఆర్ఎస్ నేతలతో కేటీఆర్ సమావేశమై పలు అంశాలపై చర్చించారు.**

ప్రజలే స్వచ్ఛందంగా ముందుకు వచ్చి గ్రామ సభల్లో ప్రభుత్వాన్ని గ్యారంటీలపై నిలదీస్తున్నారని కేటీఆర్ తెలిపారు. గ్రామ సభలకు వేసిన టెంట్లను కూడా ప్రజలు కోపంతో పీకేస్తున్నారు.

2లో



## సంపాదకీయం

### ఉచితాలతో అప్పుల ఊబిలోకి!

'ప్రజలకు స్వీట్ల మాదిరి ఉచితాలను పంచిపెడుతూ పోతే ఆధునిక భారత దేశం అంధకార యుగంలోకి జారిపోతుంది.. ఉచితాలను అమలు చేస్తే ఎక్స్‌ప్రెస్ వేలు, విమానాశ్రయాలు, రక్షణ కారిడార్లను నిర్మించలేం' అని ప్రధానమంత్రి నరేంద్రమోదీ 2022 జూలై 16న యూపీలో బుందేల్‌ఖండ్ ఎక్స్‌ప్రెస్ వేను ప్రారంభిస్తూ హెచ్చరించారు. మోదీ దారిలో కేంద్రమంత్రులు కూడా ఉచితాలను విమర్శించారు. అయితే ఆ తర్వాత ఏడాదే మధ్యప్రదేశ్‌లో లాడ్లీ బెహనా పథకం క్రింద మహిళలకు నెలకు రూ. 1250 చొప్పున చెల్లిస్తామని, క్రమంగా దాన్ని రూ. 3వేల వరకు పెంచుతామని బీజేపీ ప్రకటించడంతో ఆ రాష్ట్రంలో ఆ పార్టీ అధికారంలోకి రాగలిగింది. ఈ పథకాన్ని 'గేమ్ ఛేంజర్'గా ఆ పార్టీ నేతలే అభివర్ణించారు. మధ్యప్రదేశ్‌లోనే కాదు, ఆ తర్వాత ప్రతి రాష్ట్రంలో జరిగిన ఎన్నికల్లో బీజేపీ ఉచితాల మీద ఉచితాలను ప్రకటిస్తూ ఎన్నికల్లో ప్రయోజనం పొందింది. ఇటీవల జరిగిన మహారాష్ట్ర ఎన్నికల్లో కూడా లడ్కీ బెహన్ పథకం వల్ల బీజేపీకి పెద్ద ఎత్తున మహిళలు ఓట్లు వేశారు. ప్రస్తుతం దేశ రాజధాని ఢిల్లీలో జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ కనీవినీ ఎరుగని స్థాయిలో ప్రకటిస్తున్న ఉచితాల హామీలను బట్టి చూస్తే ఈ పార్టీయేనా గతంలో ఉచితాలను వ్యతిరేకించింది అని ఆశ్చర్యం కలుగుతుంది.

దేశ రాజకీయాల్లో ఈ ఉచితాల సంస్కృతి ఎంత పెనవేసుకుపోయింది అంటే ఆర్థిక వ్యవస్థపై దీని వల్ల తీవ్రమైన భారం పడుతుంది అని తెలిసినా ఏ రాజకీయ పార్టీ కూడా ఉచితాలను ప్రకటించేందుకు వెనుకాడడం లేదు. ఉచితాలను సమర్థంగా అమలు చేస్తే అధికారంలోకి తప్పకుండా రాగలుగుతాం అని ఆమ్ ఆద్మీ పార్టీ పలు ఎన్నికల్లో నిరూపించింది. మంచి నీరు, విద్యుత్, ఆరోగ్యం, విద్య, మహిళలకు బస్సు ప్రయాణం, వృద్ధులకు తీర్థ యాత్ర.. ఇలా ప్రతి రంగంలోనూ ఉచితాలను ప్రవేశపెట్టి అమలు చేయడం ద్వారా 2013 నుంచి ఇప్పటి వరకూ ఆప్‌కు ఎన్నికల్లో తిరుగులేకుండా పోతోంది. ఢిల్లీ మద్యం కేసులో అరెస్ట్ అయి జైలు నుంచి విడుదల అయిన తర్వాత ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ మరిన్ని ఉచితాలను ఎడా పెడా ప్రకటించారు. మహిళలకు ముఖ్యమంత్రి మహిళా సమ్మాన్ యోజన క్రింద నెలకు రూ. 2100 చొప్పున నగదు బదిలీ చేస్తామని, ఆలయాలు, గురుద్వారాల్లో పూజారులకు నెలకు రూ. 18వేల చొప్పున గౌరవ వేతనం చెల్లిస్తామని, ఆటోడ్రైవర్లకు, వారి కుటుంబ సభ్యులకు కూడా బీమా, వివాహాలు, స్కూలు యూనిఫారంల రూపంలో ఆర్థిక సహాయం అందిస్తామని, ఢిల్లీలో అద్దె గృహాలలో ఉన్న వారందరికీ ఉచిత విద్యుత్, నీరు సరఫరా చేస్తామని ఈ ఎన్నికల్లో ఆప్ అధినేత ప్రకటించి ప్రత్యర్థి పార్టీలను కూడా ఆత్మరక్షణలో పడేలా చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనైనా గెలవాలనుకుంటున్న బీజేపీ తాను కూడా ఉచితాల వర్షాన్ని కురిపించింది. కేజ్రీవాల్ కంటే ఒక అడుగు ముందుకు వేసి మహిళలకు రూ. 2500 చొప్పున నెలకు చెల్లిస్తామని, గర్భిణీ స్త్రీలకు రూ. 21వేలతో పాటు ఆరు పోషకాహార కిట్లను పంచిపెడ్తామని బీజేపీ ప్రకటించింది. తమ ఎన్నికల మేనిఫెస్టోను విడుదల చేస్తూ బీజేపీ జాతీయ అధ్యక్షుడు జగత్ ప్రకాశ్ నడ్డా ఇది కేవలం మొదటి భాగం మాత్రమే అనడాన్ని బట్టి కేజ్రీవాల్ ఆ పార్టీపై ఎంత ప్రభావం చూపుతున్నారో అర్థమవుతుంది. ఢిల్లీ మాత్రమే కాదు, ఇప్పుడు యావద్దేశమూ ఉచితాల బాటలో పయనిస్తోంది. 2024%-%25లో 9 రాష్ట్రాలు మహిళలకు నగదు బదిలీ క్రింద రూ. లక్ష కోట్లు ఖర్చు పెట్టాయని చట్టసభల పనితీరును అధ్యయనం చేసే పీఆర్ఎస్ పరిశోధనా సంస్థ వెల్లడించింది.రూ. 76 వేల కోట్ల ఢిల్లీ బడ్జెట్‌లో దాదాపు రూ. 15వేల కోట్లకు పైగా ఉచితాలకు, సబ్సిడీలకే ఖర్చవుతుందని, రూ. 8,159 కోట్ల మేరకు బడ్జెటరీ లోటు ఏర్పడుతుందని, పెద్ద ఎత్తున అప్పులు చేయక తప్పదని తెలిసి కూడా కేజ్రీవాల్ తిరిగి అధికారంలోకి రావడానికి ప్రజలకు హామీలను కురిపించక తప్పడం లేదు. జాతీయ చిన్నపొదుపు మొత్తాల నిధి నుంచి కూడా ఆప్ ప్రభుత్వం అప్పులు చేసి రోజువారీ ఖర్చులను భరించాల్సి వస్తోంది.

కేంద్ర ఆర్థిక పరిస్థితి కూడా అంత దివ్యంగా ఏమీ లేదు. ఈ ఆర్థిక సంవత్సరాంతానికి మార్కెట్ అప్పులతో సహా కేంద్రం అప్పులు రూ. 185 లక్షల కోట్లకు చేరుకోబోతున్నాయి. జీడీపీలో 56.8 శాతం దేశం అప్పులే ఉన్నాయి. ప్రతి ఏడాదీ రూ. 30 లక్షల కోట్లు ప్రభుత్వం అదనంగా అప్పులు చేయాల్సి వస్తున్నది. రాష్ట్రాల పరిస్థితి కూడా ఇంతకంటే దారుణంగా ఉన్నది. ఎన్నికల్లో గెలిచేందుకు రకరకాల ఉచితాలను ప్రకటించిన ప్రభుత్వాలు వాటిని అమలు చేయడం కోసం నానా కష్టాలు పడాల్సి వస్తోంది. మహారాష్ట్రలో లడ్కీ బెహనా పథకం అమలు చేసేందుకు ఏటా రూ. 46వేల కోట్లు ఎలా తేవాలా అని ప్రభుత్వం గింజుకుంటున్నట్లు సమాచారం.

# మిస్టరీ మరణాలు..
# ఆ గ్రామంలో నిషేధాజ్ఞలు

ఇంటర్నెట్ డెస్క్: రాజౌరీ జిల్లాలోని బుధాల్ గ్రామంలో నెలన్నర వ్యవధిలోనే మూడు కుటుంబాల్లో ఏకంగా 17మంది అనుమానాస్పద రీతిలో ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. ఈ అంతుచిక్కని మరణాలతో అక్కడి ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. మంగళవారం ఈ గ్రామానికే చెందిన ఐజాజ్ అహ్మద్ అనే 24 ఏళ్ల వ్యక్తి ఆరోగ్యం క్షీణించడంతో ఆసుపత్రిలో చేర్చారు. కాగా ఈ మరణాల వెనుక ఉన్న మిస్టరీ ఏంటో తెలుసుకొనేందుకు దర్యాప్తు కొనసాగుతోంది. ఇందులో భాగంగా అధికారులు ఆ గ్రామాన్ని కంటైన్‌మెంట్ జోన్ (%జశీఅ్‌ఱఅవఎవఅ్ ఓశీఅవ%)గా ప్రకటించారు. ఇకపై గ్రామంలోకి ఎటువంటి ప్రభుత్వ, ప్రైవేటు సమావేశాలు, సమావేశాలు జరపకూడదని నిషేధాజ్ఞలు జారీ చేశారు.

అత్యవసర పరిస్థితుల్లో రాతపూర్వక ఆదేశాలు జారీ చేసే అధికారం మేజిస్ట్రేట్‌లకు ఉందని అధికారులు పేర్కొన్నారు. అంతుచిక్కని ప్రమాదాలు లేదా వైరస్‌ను నివారించేందుకు ఈ ఆర్డర్లు కొంతమేర సహాయపడతాయని అన్నారు. అదనపు జిల్లా మేజిస్ట్రేట్ (రాజౌరీ) రాజీవ్ కుమార్ ఖజురియా జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం.. గ్రామాన్ని మూడు కంటైన్‌మెంట్ జోన్‌లుగా విభజించారు.

కంటైన్‌మెంట్ జోన్ 1- మరణాలు సంభవించిన అన్ని కుటుంబాలను కవర్ చేస్తుంది. బాధిత కుటుంబాల నివాసాలు సీల్ చేస్తారు.

కంటైన్‌మెంట్ జోన్2- బాధిత కుటుంబాల సన్నిహితులుగా గుర్తించిన అన్ని కుటుంబాలకు చెందిన వ్యక్తుల నివాసాలు దీని కిందకు వస్తాయి. వీరి ఆరోగ్య పరిస్థితులను వైద్యులు నిరంతరం పర్యవేక్షిస్తుంటారు.

కంటైన్‌మెంట్ జోన్3 – గ్రామంలో మిగిలిన అన్ని నివాసాలు దీని పరిధిలోకి వస్తాయి. ఇక్కడి ప్రజలు ఎటువంటి ఆహారం తీసుకుంటున్నారు. లాగ్ బుక్‌ల నిర్వహణవంటి అంశాలను అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుంటారు.

అయితే బాధిత కుటుంబాలు, వారి సన్నిహితులు ప్రభుత్వ అధికారులు అందించే ఆహారాన్ని మాత్రమే



తీసుకోవాలని..వారి ఇళ్లలో ఉన్న ఇతర పదార్థాలను వినియోగించకూడదని హెచ్చరికలు జారీ చేశారు. కేసు దర్యాప్తులో భాగంగా బాధిత కుటుంబాల ఇళ్లలో ఉన్న తినదగిన పదార్థాలు అన్నిటినీ స్వాధీనం చేసుకొని పరీక్షించాలని ప్రభుత్వం ఆదేశించింది.

జమ్ముకశ్మీర్‌లోని రాజౌరీని అంతుచిక్కని మరణాలు వెంటాడుతున్నాయి. జిల్లాలోని బుధాల్ గ్రామంలో నెలన్నర వ్యవధిలోనే మూడు కుటుంబాల్లో ఏకంగా 17మంది అనుమానాస్పద రీతిలో ప్రాణాలు కోల్పోయారు. ఈ మరణాలకు బ్యాక్టీరియా లేదా వైరస్ కారక సాంక్రమిక వ్యాధులు కారణం కాదని ప్రాథమికంగా తేలినట్లు అధికారులు వెల్లడించారు. దీంతో ఇక్కడి పరిస్థితిని నిశితంగా పరిశీలిస్తున్నామని చెప్పిన ప్రభుత్వం.. దర్యాప్తు కోసం 11 మందితో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసినట్లు ప్రకటించింది.

మంగళవారం జమ్మూకశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా బాధిత కుటుంబాలను కలిసి సానుభూతి తెలియజేసేందుకు ఆ గ్రామానికి వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఈ మరణాల వెనుక ఉన్న మిస్టరీ ఏంటో తెలుసుకొనేందుకు దర్యాప్తు కొనసాగుతోందన్నారు. అన్ని ప్రశ్నలకు త్వరలోనే సమాధానం దొరుకుతుందని హామీ ఇచ్చారు.

# కుంభమేళాలో మహా ప్రసాదం
# వడ్డించిన సుధామూర్తి

**కుంభమేళాలోని ఇస్కాన్ కిచెన్‌ను సందర్శించిన ఎంపీ సుధామూర్తి.. అక్కడి భక్తులకు స్వయంగా మహా ప్రసాదాన్ని వడ్డించారు.**

ప్రయాగ్‌రాజ్: ప్రపంచంలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక వేడుక మహా కుంభమేళా ను సందర్శించుకున్నారు. ప్రముఖ వితరణశీలి, రాజ్యసభ ఎంపీ సుధామూర్తి . మూడు రోజుల పర్యటన నిమిత్తం సోమవారం ప్రయాగ్‌రాజ్ చేరుకున్న ఆమె.. పవిత్ర త్రివేణి సంగమంలో పుణ్యస్నానం ఆచరించారు. బుధవారం స్థానిక ఇస్కాన్ క్యాంప్‌ను సందర్శించి భక్తులకు స్వయంగా మహా ప్రసాదాన్ని వడ్డించారు.

తొలుత ఇస్కాన్ కిచెన్‌కు వెళ్లిన ఎంపీ అక్కడి వాలంటీర్లతో కొంతసేపు ముచ్చటించారు. మెషిన్లతో భోజన తయారీని అడిగి తెలుసుకున్నారు. అనంతరం కౌంటర్ వద్ద నిలబడి కుంభమేళాకు వచ్చిన భక్తులకు చపాతీ, భోజనం వడ్డించారు. ఈ మహా కుంభమేళా ను ఆమె 'తీర్థరాజ్'గా అభివర్ణించారు. తన పూర్వీకులకు తర్పణం వదిలేందుకు ఇక్కడకు వచ్చానని చెప్పారు.

మహా కుంభమేళా స్పేస్ వ్యూ చిత్రాలను విడుదల చేసిన ఇస్రో



మహాకుంభ మేళాలో ప్రముఖ ఆధ్యాత్మిక సేవా సంస్థ 'ఇస్కాన్', అదానీ గ్రూప్ తో కలిసి నిత్యం లక్షమంది భక్తులకు భోజనాలు సమకూరుస్తోంది. తమ శిబిరాల్లో ఈ భోజనాలు వండి ప్రయాగ్‌రాజ్‌లోని కేంద్రాలకు చేరవేస్తోంది. ఆహారం పంపిణీకి అదానీ గ్రూప్ వంద వాహనాలు, వాలంటీర్లను సమకూర్చింది. దీంతో పాటు గీతా ప్రెస్‌తో కలిసి కుంభమేళాకు వచ్చిన భక్తులకు 'ఆర్తి సంగ్రహ' పుస్తకాలను ఉచితంగా (కోటి కాపీలు) అందిస్తోంది. మంగళవారం అదానీ గ్రూప్ ఛైర్మన్ గౌతమ్ అదానీ కూడా తన కుటుంబంతో కలిసి ఇస్కాన్ శిబిరాన్ని సందర్శించిన సంగతి తెలిసిందే. ఇక్కడ భోజన తయారీలో వారు పాలుపంచుకున్నారు. యాత్రికులకు స్వయంగా వడ్డించారు.

# దావోస్‌లో ప్రత్యేక ఆకర్షణగా
# తెలంగాణ పెవిలియన్

ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యంతో దేశంలోనే మొట్ట మొదటగా యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. దాదాపు 18 రంగాలకు చెందిన వివిధ పరిశ్రమలకు అవసరమైన ప్రపంచ స్థాయి నైపుణ్యాలపై యువతకు శిక్షణను అందిస్తోంది. వీటితో పాటు ఐఎస్బీ, ఐఐఐటీ, నల్సార్ లాంటి ప్రముఖ విద్యా సంస్థలను ఈ జాబితాలో ప్రస్తావించారు.అభివృద్ధి నినాదాలతో తెలంగాణ భవిష్యత్తు ప్రణాళికలను ప్రదర్శించారు. దేశంలోనే అత్యంత నివాసయోగ్యమైన సిటీగా హైదరాబాద్ నగరానికి ఉన్న ప్రత్యేకతలు, ఆకర్షణలను కళ్లకు కట్టించేలా బ్యాక్ గ్రౌండ్ వాల్ పోస్టర్లను అమర్చారు. తెలంగాణలో ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాల సమాచారాన్ని ఈ పెవిలియన్‌లో పొందుపరిచారు. దేశంలోనే మూడో అతి పెద్ద మెట్రో నెట్ వర్క్, ఎయిర్ పోర్ట్ వరకు మెట్రో విస్తరణ, దేశ విదేశీ ప్రయాణీకులకు అనువైన అంతర్జాతీయ విమానాశ్రయం, హైదరాబాద్ చుట్టూ ఔటర్ రింగ్ రోడ్డుతో పాటు కొత్తగా తలపెట్టిన రీజనల్ రింగ్ రోడ్డుతో మెరుగైన రవాణా సదుపాయాలను ఇందులో ప్రస్తావించారు. తెలంగాణలో పెట్టుబడులకు ప్రజా ప్రభుత్వం అనుసరిస్తున్న సానుకూల విధానాలను ఇందులో ప్రస్తావించారు. రాష్ట్ర ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన చిన్న, మధ్యతరహా పరిశ్రమల విధానంతో పాటు, ఎలక్ట్రిక్ వెహికల్స్, లైఫ్ సైన్సెస్, ఎలక్ట్రానిక్స్, సెమీ కండక్టర్లు, ఇంధన రంగాల అభివృద్ధికి ప్రోత్సహకాలతో పాటు పరిశ్రమలకు అవసరమైన అనుమతులకు సులభమైన సింగిల్ విండో క్లియరెన్స్ విధానాన్ని ఇందులో ప్రస్తావించారు. దేశంలోనే ఉన్నత జీవన ప్రమాణాలు అందుబాటులో ఉన్న అత్యంత నివాసయోగ్యమైన నగరం హైదరాబాద్. చారిత్రకంగా సాంస్కృతికంగా వారసత్వంగా హైదరాబాద్ సిటీకి ప్రాధాన్యతలు, ఇక్కడి కళా సంపదను ప్రచారం చేయటంతో పాటు గ్రేటర్ సిటీ అభివృద్ధికి ఉన్న భవిష్యత్తు లక్ష్యాలను ఇందులో విశ్లేషించారు. భద్రతతో పాటు తక్కువ జీవన వ్యయం ఉన్న నగరాల్లో ఒకటిగా హైదరాబాద్ పెట్టుబడులకు గమ్య స్థానంగా నిలిచింది. హైదరాబాద్ నగరం ఏర్పడినప్పటి నుంచి ఎదిగిన తీరును చార్మినార్‌తో పాటు సికింద్రాబాద్ క్లాక్ టవర్, హైటెక్ సిటీ.. అధునాతన ఫ్యూచర్ సిటీ నమూనాను తలపించే వాల్ పోస్టర్ అందరినీ ఆకట్టుకుంది. తెలంగాణ రైజింగ్ 2050 లక్ష్యానికి అనుగుణంగా ఫ్యూచర్ సిటీ 14 వేల ఎకరాల్లో విస్తరిస్తుందని, అందులో 6000 ఎకరాల్లో అటవీ పరిరక్షణ ఎకో జోన్ ఉంటుందని.. ఇది దేశంలోనే మొట్టమొదటి నెట్ జీరో సిటీగా అభివృద్ధి చెందుతుందని భవిష్యత్తు విజన్‌ను ఇందులో పొందుపరిచారు. ఇన్నోవేషన్, ఎలక్ట్రానిక్స్, మెడికల్ టూరిజం, మరియు ఎకో–టూరిజం వంటి ప్రత్యేక జోన్లతో 'వర్క్, లైవ్, లెర్న్, ప్లే' కాన్సెప్ట్ పై ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేయాలని ప్రభుత్వం సంకల్పించింది.

# తెలంగాణలో కొనసాగుతున్న
# పెట్టుబడుల వేట

మొదటి పేజీ తరువాయి

కామారెడ్డిలో పామాయిల్ తయారీ యూనిట్ ఏర్పాటుతో పాట్లు బాటిల్ క్యాప్‌ల తయారీ యూనిట్‌ను నెలకొల్పేందుకు యూనిలీవర్ సంసిద్ధత వ్యక్తం చేసింది. ఆపై టెక్ దిగ్గజం హెచ్‌సీఎల్ సైతం హైదరాబాద్‌లో పెట్టుబడులకు ముందుకొచ్చింది. 3.2 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో పెద్ద డేటా సెంటర్ ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంది. ఈ సెంటర్ ఏర్పాటుతో 5000 మందికి ఉద్యోగాలు వస్తాయని సీఎం రేవంత్ రెడ్డి, ఐటీ మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు.

# బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయాలపై
# కన్నెత్తి చూసినా ఊరుకోం

మొదటి పేజీ తరువాయి

నల్లగొండ,బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయాలపై కన్నెత్తి చూసినా ఊరుకునే ప్రసక్తే లేదని బీఆర్‌ఎస్ నాయకురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత హెచ్చరించారు. యాదాద్రి భువనగిరి జిల్లా బీఆర్‌ఎస్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో పాల్గొన్న కల్వకుంట్ల కవిత.. 60 లక్షల మంది సైనికులు ఉన్న కుటుంబం తమ బీఆర్‌ఎస్ పార్టీ అని, తమ పార్టీ కార్యాలయాలపై, ఇళ్లపై దాడులుకు భయపడే ప్రసక్తే లేదన్నారు. తమ పార్టీ కార్యకర్తలు తలుచుకుంటే తెలంగాణలో కాంగ్రెస్ నాయకులు తిరిగే పరిస్థితి కూడా ఉండదని హెచ్చరించారు. ఖబర్దార్ కాంగ్రెస్ నాయకులారా.. జాగ్రత్తగా ఉండండి, ఇంకోసారి బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయం వైపు కన్నెత్తి చూసినా పార్టీ కార్యకర్తలు ఊరుకోరు అంటూ కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. రౌడీ మూకలతో ఇతరుల పార్టీ కార్యాలయాలపై దాడి చేసే దరిద్రపు సంస్కృతి తమది కాదని చెప్పారు. మూసీ మురికిమయం కావడానికి కారకులు ఎవరో ప్రజలు ఇప్పటికైనా గుర్తించాలని కవిత చెప్పారు. రాష్ట్రాన్ని 60ఏళ్లు పాలించిన పారిశ్రామిక వ్యర్థాలు మూసీలో కలుస్తుంటే కాంగ్రెస్ ఏం చేసిందని ప్రశ్నించారు. హైదరాబాద్ కు దగ్గర్లో ఉన్న కొండపోచమ్మ సాగర్ ను వదిలేసి దూరంగా ఉన్న మల్లన్న సాగర్ నుంచి మూసీ – గోదావరి అనుసంధానం చేస్తామని ప్రభుత్వం అనడం సరికాదన్నారు. మూసీని కాంగ్రెస్ నాయకులు ఏటీఎంగా మార్చుకోవాలని చూస్తున్నారని కవిత ఆరోపించారు. కాంట్రాక్టర్ల కోసమే ప్రభుత్వం ఈ ప్రాజెక్టును చేపడుతోందన్నారు. అందులో భాగంగానే అనుసంధాన ప్రాజెక్టు వ్యయాన్ని రూ.7,500 కోట్లకు పెంచారని, ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపణలు చేశారు. కొండపోచమ్మ నుంచి మూసీ అనుసంధానం చేసే ఆస్కారం ఉన్నప్పటికీ ఈ కొత్త ప్రాజెక్టు ఎందుకని అడిగారు. ఈ విషయంపై నల్లగొండ జిల్లాకు చెందిన ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మూసీలో మురుగునీటి శుద్ధి కోసం 31 ఎస్టీపీలను కేసీఆర్ ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్న కవిత.. మూసీ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు అప్పట్లోనే ప్రణాళికలు రూపొందించారని గుర్తు చేసుకున్నారు. మూసీ ప్రక్షాళన పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజలపైకి ఇళ్లపైకి బుల్డోజర్లను పంపి, కూల్చివేస్తోందని కవిత ఆరోపించారు. మూసీ ప్రక్షాళనకు అయ్యే వ్యయాన్ని మొదట్లో రూ.50 వేల కోట్లు అని, ఆ తర్వాత రూ. 1లక్ష కోట్లు, మరోసారి లక్షన్నర కోట్లు అని సీఎం చెబుతూ.. మూసీని ఏటీఎంగా మార్చుకొని ఆ డబ్బును ఢిల్లీకి పంపించే ప్రణాళిక చేస్తున్నారని చెప్పారు. మరోపక్క యాదాద్రిలో కేసీఆర్ మొదలుపెట్టిన పనులను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే పూర్తి చేయాలన్న కవిత.. యాదాద్రి వైభవాన్ని ప్రభుత్వం కాపాడాలని కోరారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా అభివృద్ధికి కేసీఆర్ ఎంతగానో కృషి చేశారని, అందులో భాగంగానే మిషన్ భగీరథ పథకం కింద ఇంటింటికి తాగునీరు సరఫరా చేశారని చెప్పారు. ఫ్లోరైడ్ ని నిర్మూలించిన ఘనత కేసీఆర్ దేనని, ఏళ్లు పాలించిన కాంగ్రెస్ పార్టీ ఒక్క వాటర్ ప్లాంట్ పెట్టిన పాపాన కూడా పోలేదని ఆరోపించారు.

# గ్రామసభలను చూస్తే..

### కాంగ్రెస్ ప్రజా పాలన తీరు ఏమిటో తెలిసిపోతోంది : కేటీఆర్

మొదటి పేజీ తరువాయి

సత్తుపల్లిలో సండ్ర వెంకట వీరయ్య, ఖమ్మంలో పువ్వాడ అజయ్ ఓడిపోవడంతో ఆ నియోజకవర్గ ప్రజలు ప్రజలు ఎంతో కోల్పోయారు. గ్రామాలు, పట్టణాల్లో కేసీఆర్ హాయంలో జరిగినన్నీ పనులు గతంలో ఎప్పుడూ జరగలేదు. మున్సిపాలిటీకి రూ. 50 లక్షలు కేటాయిస్తే గొప్ప అనుకునే పరిస్థితి ఉండేది.. కేసీఆర్ హయంలో ఆ పరిస్థితి మారి పల్లెలు, పట్టణాల్లో అభివృద్ధి జరిగిందని కేటీఆర్ పేర్కొన్నారు.

భవిష్యత్ మనదే. అన్ని వర్గాలలో ఈ ప్రభుత్వంపై అసంతృప్తి ఉంది. సత్తుపల్లిలో మళ్ళీ ఎగిరేది గులాబీ జెండానే. మళ్ళీ కేసీఆర్‌ను సీఎంను చేసుకునే దాకా విశ్రమించకుండా పోరాడుదాం. ఉమ్మడి ఖమ్మంలో మళ్ళీ బీఆర్‌ఎస్ విజయకేతనం ఎగురేస్తుంది. సత్తుపల్లి మున్సిపల్ కౌన్సిలర్లు 23 మంది బీఆర్‌ఎస్ నుంచి గెలిస్తే 17 మంది ఇంకా పార్టీలోనే కొనసాగుతుండటం పార్టీ పట్ల వారికున్న విధేయతకు నిదర్శనం. రైతుల సమస్యలపై అధ్యయన కమిటీ వేశాము. రానున్న రోజుల్లో ప్రజావ్యతిరేక ప్రభుత్వంపై మరింత గట్టిగా పోరాడుదాం. త్వరలోనే సత్తుపల్లి నేతలతో కేసీఆర్ సమావేశమవుతారని కేటీఆర్ తెలిపారు

# వీణవంక పిహెచ్సి ని ఆకస్మిక తనిఖీ చేసిన
# డి ఎం హెచ్ ఓ డాక్టర్ వెంకటరమణ..

**కరపత్రం ప్రతినిధి, వీణవంక, జనవరి 22.**

వీణవంక మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం కరీంనగర్ జిల్లా డీఎంహెచ్ఓ వెంకటరమణ ఆకస్మిక తనిఖీ చేపట్టారు. వీణవంక పి హెచ్ సి లోని అందిస్తున్న సేవలను, ఆస్పత్రిలో ఉన్న వైద్య సదుపాయాలను , రికార్డులను, ఆస్పత్రిలో అందిస్తున్న వైద్య సేవలపై పరిశీలించి సంతృప్తి వ్యక్తపరిచారు. అనంతరం మాట్లాడుతూ.. వీణవంక పిహెచ్సి పరిధిలోని గ్రామాల ప్రజలకు నిరంతర వైద్య సేవలు అందించాలని, గర్భిణీలకు, రోగులకు ఎలాంటి ఇబ్బంది



కలగకుండా ఆరోగ్య సేవలు అందించాలని ఆరోగ్య సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్వో చందు, పిహెచ్సి వైద్యులు వరుణ, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు..

## 19వార్డు లో ప్రజాపాలన కార్యక్రమం....



**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట జనవరి 22....**



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలనలో భాగంగా మున్సిపల్ పరిధిలోని 19వ వార్డులో ఏర్పాటు చేసిన సభలో తెలంగాణ ప్రభుత్వం ముఖ్యమంత్రి యనమల రేవంత్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టినటువంటి ఇందిరమ్మ ఇండ్లు మరియు కొత్త రేషన్ కార్డు గత ప్రభుత్వ హయాంలో ఇవ్వనటువంటి ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు గత ప్రభుత్వ హయాంలో మీ సేవ కేంద్రాలలో పెట్టుకున్నటువంటి రేషన్ కార్డులో పేర్ల తొలగింపు మరియు పేర్ల జమచేయుట వంటి దరఖాస్తులు స్వీకరించడం జరిగింది ఇట్టి కార్యక్రమంలో జమ్మికుంట మున్సిపల్ వైస్ చైర్మన్ కోటి మాట్లాడుతూ ముఖ్యమంత్రి యనమల రేవంత్ రెడ్డి చేపట్టినటువంటి ఈ కార్యక్రమంలో ఇందిరమ్మ ఇండ్లు మరియు కొత్త రేషన్ కార్డులు పేర్ల మార్పు చేర్పులు ఈ ప్రక్రియ నిరంతరం జరుగుతుంది సోషల్ మీడియాలో ప్రభుత్వం మీద బురదజల్లే విధంగా వస్తున్నటువంటి వార్తలు ఎవరు పట్టించుకోవద్దు అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇల్లు మరియు రేషన్ కార్డులు తప్పకుండా ఈ ప్రభుత్వం అందిస్తుంది అర్హులందరికీ అన్ని పథకాలు అందేలా చూస్తామని దేశిని స్వప్న కొటి తెలిపారు.కార్యక్రమంలో వార్డ్ ఆఫీసర్ శేఖర్ & శ్రీకాంత్ ఆర్పీ జేరిపోతుల సృజన సిబ్బంది ఉద్యోగులు కోడెం రాజు దూడపాక స్వామి అంగన్వాడి టీచర్ స్వప్న కాంగ్రెస్ నాయకులు దేశిని శ్రీనివాస్ ఎండి సజ్జు ఉడత వెంకటేష్ ఆడెపు దేవరాజ్ ఎండి ఖలీల్ మంద సునీల్ తదితరులు పాల్గొన్నారు

## వైద్య ఆరోగ్యశాఖ, ప్రభుత్వ ఆసుపత్రులపై అసత్య వార్తలు ప్రచురించి ప్రజలను తప్పుదోవ పట్టిస్తే సంబంధిత వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ స్పష్టం చేశారు .

**కరపత్రం దినపత్రిక మెదక్ నర్సాపూర్.**





బుధవారం నర్సాపూర్ ఏరియా ఆసుపత్రిని ఆకస్మికంగా పరిశీలించారు. ముందుగా ఆస్పత్రి మొత్తం అన్ని వార్డులు పరిశీలించి సిబ్బంది, హాజరు పట్టికలు, స్టాక్ రిజిస్టర్లు , రోగులు చికిత్స పొందే వార్డులు పరిశీలించారు . ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మందులు లేక రోగుల అవస్థలు అని కొందరు ఆ వాస్తవ వార్తలు వ్యాప్తి చేయడం వీటిపై స్పందించి ఆసుపత్రిని ఆకస్మిక పరిశీలన చేయగా ఇది కేవలం అసత్య కథనం అని వాస్తవాలు లేవని కలెక్టర్ స్పష్టం చేశారు ఆసుపత్రిలో సమర్థవంతంగా నిర్వహించడం జరుగుతుందని ఎటువంటి లోటుపాట్లు లేవని రోగులు తమంతట తాము చెప్పడం చూస్తే ఆసుపత్రి సిబ్బంది చాలా బాగా పనిచేస్తున్నారని అర్థమవుతుందని చెప్పారు. ప్రభుత్వ ఆసుపత్రులలో డాక్టర్లు సిబ్బంది విధి నిర్వహణపై నిఘానేత్రాల ద్వారా సమీకృత కలెక్టరేట్ కార్యాలయం నుండి పర్యవేక్షణ చేయడం జరుగుతుందని వివరించారు ప్రజల కోసం నిరంతరం కృషి చేస్తున్న డాక్టర్లను ఈ సందర్భంగా అభినందించారు. డాక్టర్ల మనోధైర్యం దెబ్బతిని విధంగా అసత్య ప్రచారాలు చేస్తే ఇకపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని తెలిపారు ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరిండెంట్ పావని సంబంధిత వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు

## గ్రామ సభలలో జనం గరం గరం..జాబితాలో అనర్హులు... అర్హుల పేర్లు గల్లంతు..

**- కొత్త దరఖాస్తులు స్వీకరించిన అధికారులు..**

**కరపత్రం ప్రతినిధి,వీణవంక, జనవరి 22.**



వీణవంక మండలంలో వీణవంక, బొంతుపల్లి,వల్భాపూర్, కోర్కల్, మామిడాలపల్లి, నరసింహులపల్లి, పోతిరెడ్డిపల్లి, లస్మక్కపల్లి గ్రామాలలో రెండవ రోజు బుధవారం గ్రామసభలు గందరగోళంగా సాగాయి. మొదటిరోజు మాదిరిగానే గ్రామ గ్రామాన గ్రామ సభలలో నిరుపేదలైన లబ్ధిదారుల పేర్లు రాకుండా, అనర్హుల పేర్లు రావడం ఏందని, అధికారులను ఆయా గ్రామాల ప్రజలు ప్రశ్నించారు. అధికారులు చేసేదేమి లేక మళ్లీ దరఖాస్తు చేసుకోమని, నూతన దరఖాస్తులను స్వీకరించారు. తెలంగాణ ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా, కొత్త రేషన్ కార్డులు అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి ఇస్తామని, నమ్మబలికి, నిరుపేదలకు, దివ్యాంగులకు, వితంతువులకు, ఒంటరి మహిళలకు, పారిశుద్ధ్య కార్మికులకు నాలుగు సంక్షేమ పథకాలలో మొదటి ప్రాధాన్యత కలిగిస్తామని, అర్హత లేని, ధనవంతుల పేర్లు లిస్టులో వచ్చాయని, ఇప్పటికైనా తెలంగాణ ప్రభుత్వం, ప్రజా ప్రతినిధులు జిల్లా అధికారులు, మండల అధికారులు, గ్రామ అధికారులు చొరవ తీసుకుని, సంక్షేమ పథకాలపై, సర్వేను పారదర్శకంగా జరిపి, పేదవాడికి న్యాయం చేయాలని, గ్రామగ్రామాన గ్రామ సభల్లో నిరుపేదలు ఆవేదన వ్యక్తపరుస్తున్నారు.

# విద్యార్థికి నగదును అందించిన ఇంగ్లీష్ ఉపాధ్యాయుడు శ్రీనివాసరావు దేశ్ముఖ్...

**- విద్యార్థిని, ఉపాధ్యాయుని అభినందించిన హెచ్ఎం....**
**- ఇష్టంతో విద్యను అభ్యసించాలి..**
**- హెచ్ఎం నీరజ...**



**కరపత్రం శంకరపట్నం జనవరి 22**

ఇంగ్లీష్ భాష ఉపన్యాస పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థికి, ఇంగ్లీష్ ఉపాధ్యాయుడు నగదు ప్రోత్సకాహాన్ని అందించి విద్యార్థిని ప్రోత్సహించడం అభినందనీయమని ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కంకణాల నీరజ అన్నారు. మంగళవారం కరీంనగర్ జిల్లా మానకొండూరు నియోజకవర్గం శంకరపట్నం మండలం మొలంగూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో ఎనిమిదవ తరగతి విద్యను అభ్యసిస్తున్న మూతునూరి చెరితేష్ ఇంగ్లీష్ ఉపన్యాస పోటీలలో ఆంగ్ల భాష పై ప్రావీణ్యాన్ని ప్రదర్శించి ఆంగ్లంలో ఉపన్యాసించినందుకు మండల స్థాయిలో, జిల్లాస్థాయిలో చెరితేష్ ప్రతిభ కనబరిచి తన బోధనకు, పాఠశాలకు జిల్లా స్థాయిలో పేరు ప్రఖ్యాతులు తీసుకువచ్చిన విద్యార్థి చెరితేష్ ను అభినందిస్తూ చెరితేష్ ను ఆంగ్ల భాష ఉపన్యాసంలో ప్రోత్సహిస్తున్న పాఠశాల ఇంగ్లీష్ ఉపాధ్యాయుడు శ్రీనివాసరావు దేశు ముఖ్ సేవలు అభినందనీయమని, ప్రతి విద్యార్థి పోటీ తత్వంతో తన సృజనాత్మకతను ప్రదర్శిస్తూ ప్రతిభ పోటీలలో పాల్గొని తమ ప్రతిభను చాటాలని, ఇంగ్లీష్ ఉపన్యాసం పై మక్కువ పెంచుకొని చెరితేష్ ఉపన్యాసించి జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచి, ఇంకా ముందుకు సాగాలని సూచించారు. గ్రామానికి చెందిన నరహరి చిన్న వెంకటరెడ్డి కుటుంబ సభ్యుల అల్లుండ్లు కొమ్మెర చంద్రశేఖర్ రెడ్డి, మాందాడి మనోహర్ రెడ్డి గత సంవత్సరం 10వ తరగతి ఉత్తీర్ణతలో టాపర్లుగా నిలిచిన విద్యార్థులకు 5116 రూపాయల నగదును అందజేసినట్లు పేర్కొన్నారు ఇట్టి నగదును 26 జనవరి రిపబ్లిక్ డే దినోత్సవం రోజున ప్రతిభ కనబరిచి టాపర్లుగా నిలిచిన విద్యార్థులకు అందజేయడం జరుగుతుందని తెలిపారు ప్రతి విద్యార్థి ఇష్టంతో శ్రద్ధతో ఉన్నత చదువులు చదివి ఉన్నత ఉద్యోగాలు సాధించి కన్న తల్లిదండ్రులకు పుట్టిన గ్రామానికి పాఠశాలలకు పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం తదితరులు ఉన్నారు.

# అర్హులందరికీ సంక్షేమ పథకాలు....

**- గ్రామసభలోను సద్వినియోగం చేసుకోవాలి....**
**- తహసిల్దార్ భాస్కర్...**





**కరపత్రం శంకరపట్నం జనవరి 22**

అర్హులందరికీ ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు సంక్షేమ పథకాలను అందజేయడం జరుగుతుందని ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు నిర్వహిస్తున్న గ్రామసభలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకొని సంక్షేమ పథకాలను పొందాలని శంకరపట్నం తాసిల్దార్ బత్తుల భాస్కర్ అన్నారు. బుధవారం కరీంనగర్ జిల్లా మానకొండూరు నియోజకవర్గం శంకరపట్నం మండలం లోని కేశవపట్నం, ధర్మారం, చింతల పల్లె గ్రామాలతో పాటు పలు గ్రామాల్లో ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా తెలుపు రేషన్ కార్డులు, రైతు భరోసా లబ్ధిదారుల ఎంపిక గ్రామసభలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన మండల తాసిల్దార్ బత్తుల భాస్కర్, ఎంపీడీవో గోల్కొండ కృష్ణ ప్రసాద్ మాట్లాడారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో సర్వే బృందాన్ని ఏర్పాటు చేసి లబ్ధిదారుల ఎంపిక కోసం క్షేత్రస్థాయి పరిశీలనలు, తనిఖీలు, నిర్వహించి గ్రామాల్లో 26వ తేదీ వరకు గ్రామ సభలు నిర్వహించి లబ్ధిదారుల ఎంపిక కోసం నివేదికలను ఉన్నతాధికారులకు అందజేయడం జరుగుతుందని, ఇట్టి సర్వేలో పాల్గొనని అర్హులైన ప్రతి ఒక్కరూ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రజా పాలన కేంద్రంలో తమ అర్జీలను సమర్పించుకొని అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందవచ్చునని సూచించారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు గ్రామసభలు నిర్వహించి గ్రామసభలో ప్రజల ముందు, రాజకీయ పార్టీల నాయకుల ఎదుట, లబ్ధిదారుల ఎంపిక చేయడం జరుగుతుందని, ప్రతి ఒక్కరూ గ్రామ సభలను సద్వినియోగం చేసుకొని ప్రభుత్వము అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరు పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ కాసగొని ప్రభాకర్, మండల పరిషత్ సూపరింట్ రాఘవేందర్ రెడ్డి, ఆర్ ఐ ప్రత్యూష, పంచాయతీ కార్యదర్శులు నరసయ్య, వీర ప్రతాప్, ప్రసన్న, వివిధ రాజకీయ పార్టీల నాయకులు గ్రామస్తులు లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు

# అంతిమ దహన సంస్కారాలకు ఆమడ దూరంలో కొత్తపల్లి...

**- అసంపూర్తి నిర్మాణం, సరిపడా నిధులు లేక దహన సంస్కారాలకు గ్రామస్తుల ఇబ్బందులు**
**- స్మశాన వాటికకు తగినన్ని నిధులు కేటాయించాలని గ్రామస్తుల వేడుకలు..**





**కరపత్రం ప్రతినిధి హుజురాబాద్ జనవరి 22.....**

హుజురాబాద్ పట్టణానికి కూత వేటు దూరంలో ఉన్న ఆ గ్రామానికి ప్రజలకు కావలసిన కనీస సౌకర్యాలు లేక గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కనీసం అంతిమ సంస్కారాలను నిర్వహించడానికి కూడా సరైన సౌకర్యాలకు గ్రామస్తులు నోచుకోకపోవడం బాధిస్తోంది. గత పదిఏళ్ల క్రితం బిఆర్ఎస్ ప్రభుత్వం గ్రామానికి అంతిమ సంస్కారాలు నిర్వహించేందుకు స్మశాన వాటికను మంజూరు చేయగా సరిపడ నిధులు లేకపోవడంతో అసంపూర్తిగా మిగిలింది. ఆ నిధులతో రెండు చితి పేర్చే గదులను నిర్మించారు. అప్పటి టిఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు ఆకుల రవి కృషితో స్మశాన వాటిక వద్ద బోరు, మోటారు మంజూరు చేయగా ఏర్పాటు చేశారు. అయితే స్మశాన వాటికను రోడ్డుకు లెవెల్ గా నేర్పకపోవడం, చితి గదులను ఎత్తులో ఏర్పాటు చేసి చుట్టూ చెట్లు చెదారం పెరిగి పాములకు, తేళ్లకు ఇతర జంతువులకు విష సర్పాలకు నిలయంగా మారింది. దీంతో గ్రామస్తులు ఎవరైనా మృతి చెందితే దహన సంస్కారాలు అక్కడ చేయడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. స్మశాన వాటికకు సుమారు 8 గుంటల స్థలం కేటాయించగా దానికి హద్దులు పెట్టకపోవడం, చుట్టూ కాంపౌండ్ వాల్ లేకపోవడం, కంకర కుప్పలు, మొరం, రాళ్లు రప్పలు ఉండడంతో అంత్యక్రియలు నిర్వహించాలంటేనే అటువైపు వెళ్లడానికి ప్రజలు జంకుతున్నారు. ద్వారము వద్ద పశువులను కట్టేసి పశువుల కొట్టంగా వాడుకుంటున్నారు. ఏపుగా పెరిగిన ముళ్ళ చెట్లు గుంతలతో స్మశాన వాటిక పూర్తిగా నిరుపయోగంగా మారింది. గత ఐదేళ్ల క్రితం కొత్తపల్లి గ్రామం మున్సిపాలిటీలోకి కలువగా నాటి నుండి ఎవరు పట్టించుకోకపోగా, ఏడాది క్రితము కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి అధికారులకు, ప్రజాప్రతినిలకు తెలిపిన పట్టించుకోవడంలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా కొత్తపల్లి స్మశాన వాటికకు శాశ్వత కాంపౌండ్ వాల్, స్నానాల గదులు, అదనపు బోరును మంజూరు చేసి ప్రజలకు అంతిమ సంస్కారాలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అణువుగా ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సంవత్సరాల కొద్ది తిరుగుతున్న పట్టించుకోవడం లేదు..!
-ఆకుల రవి, బిఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ మాజీ అధ్యక్షుడు. కొత్తపల్లి- హుజురాబాద్.

గత 12 ఏళ్లుగా గ్రామానికి స్మశాన వాటిక కావాలని అధికారుల చుట్టూ తిరిగితే నవమాత్రపు నిధులు మంజూరు చేసి అసంపూర్తిగా నిర్మించి వదిలేశారు. గత ఐదేళ్లుగా మళ్లీ అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ తిరుగుతున్న ఎవరు పట్టించుకోవడం లేదు. కెసిఆర్ అధికారంలో ఉన్నప్పుడు ఐదు లక్షల రూపాయలు మంజూరు చేయగా స్మశాన వాటిక ఎంట్రన్స్ తోరణము, బోరుబావి, మోటారు బిగించడం, రెండు చితి పేర్చే గదులను నిర్మించారు. చితి గదులకు సమానంగా భూమిని చదును చేయకపోవడం రాళ్లురప్పలు, ముళ్ళ చెట్లు పెరిగిపోవడం, చుట్టూ కాంపౌండ్ వాల్ లేకపోవడంతో జంతువులకు, విష సర్పాలకు నిలయంగా మారింది. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకుని అంతిమ సంస్కారాలు ప్రశాంతంగా నిర్వహించుకునేలా తగిన ఏర్పాట్లు చేసేందుకు అవసరమైన నిధులు మంజూరు చేయాలని కోరుకుంటున్నా.

# టిపిటిఎల్ఎ ప్రెసిడెంట్ గా రహమాన్ నామినేషన్...!

**- ప్రవేట్ టీచర్స్,లెక్చరర్స్ సమస్యల కోసం పోరాడుతా...**



**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట జనవరి 22...**

జమ్మికుంట : తెలంగాణ ప్రైవేట్ టీచర్స్, లెక్చరర్స్ అసోసియేషన్ (టీ పి టీ ఎల్ ఏ ) జమ్మికుంట మండల అధ్యక్షులుగా స్రవంతి జూనియర్ కళాశాలలో లెక్చరర్ గా పనిచేస్తున్న మహమ్మద్ రహమాన్ బుధవారం ఎలక్షన్ కమిటి గా వ్యవహరిస్తున్న డాక్టర్ పుల్లూరి సంపత్ రావు గారికి తమ అనుచరులతో నామినేషన్ పత్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా జమ్మికుంట మండల ప్రెసిడెంట్ గా పోటీకి నిలుస్తున్న రహమాన్ మాట్లాడుతూ ప్రైవేటు ఉపాధ్యాయులు, లెక్చరర్స్ తమ సమస్యల కోసం పోరాడుతానని, అందరికీ హెల్త్ కార్డులు, పిఎఫ్ లు కట్టించడం కోసం యాజమాన్యాలతో పోరాటం చేస్తానని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రైవేటు పాఠశాలలు కళాశాలలో పనిచేస్తున్న వారికి సెలవు దినాలు వర్తించేలా కృషి చేస్తానని విద్యావంతులైన ఉపాధ్యాయులు మా విన్నపాన్ని మన్నించి ఈనెల 26న జరిగే ఎన్నికల్లో నాకు ఓటు వేసి గెలిపించగలరని ఓటర్లను వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ విద్యావేత్త మహమ్మద్ అంకూస్, ఉపాధ్యాయులు చుక్క భాస్కర్, కొండ విజయ్, అంజిబాబు, శ్రీనివాస్, కిషన్,రాజేందర్, తబస్సుమ్, స్వప్న, మమత, అలేఖ్య తదితరులు పాల్గొన్నారు.

# రోడ్ భద్రత అనేది అందరి సమిష్టి బాధ్యత ఇందులో ప్రతి ఒక్కరు భాగస్వాములుకావాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు.

**కరపత్రం దినపత్రిక మెదక్ నర్సాపూర్.**

బుధవారం రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో మెదక్ జూనియర్ కళాశాలలో వివిధ పాఠశాలల విద్యార్థులకు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు అనంతరం ర్యాలిని కలెక్టర్ రాహుల్ రాజ్ ఎస్పీ, ఉదయకుమార్ రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు మెదక్ కలెక్టరు రాహుల్ రాజ్ ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి... రోడ్ భద్రత నియమాలు సంబంధించి ప్లా కార్డులు పట్టుకుని జూనియర్ కళాశాల నుండి రాందాస్ చౌరస్తా వరకు భారీ ర్యాలీలో పాల్గొన్నారు.విద్యార్థినీ విద్యార్థులు ప్రమాదాల నివారణకు ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై "ట్రాఫిక్ నిబంధనలు పాటించండి ప్రమాదాలను అరికట్టండి" "హెల్మెంట్ ధరించడం మన ప్రాణానికి ఎంతో రక్షణ" విద్యార్థినీ విద్యార్థుల నినాదాలతో పురవీధులు మారుమోగాయి, ర్యాలీ ప్రజల్లో చైతన్య దిశగా కొనసాగింది.ఈ




సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ట్రాఫిక్ రూల్స్ కచ్చితంగా పాటించాలి,ప్రాణం చాలా విలువైనదని రోడ్ భద్రత నియమాలు ప్రతి ఒక్కరూ పాటించాలని కలెక్టర్ రాహుల్ రాజ్ సూచించారు... మోటార్ సైకిల్ మీద ప్రయాణించే ప్రతి ఒక్కరు తప్పకుండ హెల్మెట్ ను ధరించాలని, మద్యం సేవించి వాహనం నడపరాదని, ఓవర్ స్పీడింగ్ మరియు ఓవర్ టేకింగ్ చెయ్యరాదనిచెప్పారు.తల్లితండ్రుల చేతుల్లో విద్యార్థుల భవిష్యత్తు ఉంటుంది అన్నారు.మీ తల్లిదండ్రులకు బైక్ నడిపే టప్పుడు



హెల్మెట్ పెట్టుకోవాలని విద్యార్థులు చెప్పాలని కోరారు రోడ్ భద్రత నియమాలు ట్రాఫిక్ సిగ్నల్స్ గురించి వివిధ పాఠ్యాంశంగా చేర్చారని చెప్పారు. ట్రాఫిక్ రూల్స్ ప్రకారం కచ్చితంగా లెఫ్ట్ సైడ్ నుండి వెళ్ళాలని కోరారు..వాహన దారులు ట్రాఫిక్ సిగ్నల్ పాటించకుండా జంప్ చేస్తున్నారని దానీ వలన ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుందన్నారు....సినిమాలో మాదిరిగా యువకులు స్టంట్స్ వేస్తూ బైక్ విన్యాసాలు చేయద్దు అన్నారు.. సినిమా కేవలం వినోదం కోసమేనని భావించాలని చెప్పారు.ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ యుద్ధంలో మరణించిన దానీ కంటే కూడా రోడ్ ప్రమాదాలలో మరణించే వారి సంఖ్య ఎక్కువ ఉంటుందని ఆందోళన వ్యక్తం చేశారు..స్టూడెంట్ లైఫ్ నుండి రోడ్ భద్రత నియమాలు పాటించాలని కోరారు.రోడ్ ప్రమాదాలు జరిగినప్పుడు వెంటనే హాస్పిటల్ తరలించాలని కోరారు...స్కూల్ లో పాఠాలు నేర్చుకునేటప్పుడే రోడ్డు భద్రత నియమాలు నేర్చుకోవాలని కోరారు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రోడ్డు భద్రత నియమాల కోసం అనేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమాలను నిర్వహించడం ద్వారా 20% మరణాలు జిల్లాలు తగ్గాయి అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా రవాణా శాఖ అధికారి ఆర్. వెంకటస్వామి, ఆర్ అండ్ బి ఈ ఈసర్దార్ సింగ్ డీఎస్పీ ప్రసన్నకుమార్,, ఎం.ఈ.ఓ నీలకంఠం, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ విజయలక్ష్మి, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్లు శ్రీలేఖ, శ్రీనివాస్ సంబంధిత అధికారులు విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

## ఫిబ్రవరి 5 తారీకు లోపు రెండో విడత దళిత బంధు నిధులు విడుదల చేయాలి ప్రభుత్వానికి డెడ్లైన్ విధించిన దళిత బంధు సాధన సమితి:

**హుజరాబాద్ దళిత బంధు నిధుల సాధన సభలో రాష్ట్ర దళిత బంధు సాధన సమితి అధ్యక్షులు కోగిల మహేష్ హుజురాబాద్ నియోజకవర్గం ఇంచార్జ్ కొలుగూరి సురేష్**

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట జనవరి 23**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఫిబ్రవరి 5వ తారీఖు లోపు రెండో విడత దళిత బంధు నిధులు విడుదల చేసి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న దళిత బంధు బాధితులకు న్యాయం చేయాలని లేనిపక్షంలో లబ్ధిదారులు వేల మంది లబ్దారులతో బాధితులతో కలిసి చలో హైదరాబాద్ కార్యక్రమానికి పిలుపునిస్తామని కోగిల మహేష్ కొలుగూరి సురేష్ హెచ్చరించారు... హుజరాబాద్ నియోజకవర్గం లోని జమ్మికుంట పట్టణంలో దళిత బంధు బాధితుల సమావేశంలో పాల్గొన్న కోకిల మహేష్ గత 13 నెలలుగా శాంతియుత మార్గంలో నూతన ప్రభుత్వానికి రెండో విడత దళిత బంధు లబ్ధిదారులు తమ ఆకాంక్షను



తెలుపుతున్న కూడా ప్రభుత్వం స్పందించకపోవడం శోచనీయమని అన్నారు...ఇప్పటికైనా స్పందించకుంటే కచ్చితంగా రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో దళితుల సత్తా ఏంటో చూపిస్తామని హెచ్చరించారు...చింతకాని మండలంలో సాధ్యమైన రెండో విడత దళిత బంధు నిధుల విడుదల రాష్ట్రంలో ఎందుకు సాధ్యం కావడం లేదో ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేయాలని తెలిపారు..దళితులను కేవలం ఓటు బ్యాంకుగా చూస్తే అదే దళితులు రాజకీయంగా ప్రభుత్వాన్ని పాతర వేయడం రాబోయే రోజుల్లో చూస్తారని వారు తీవ్రంగా మండిపడ్డారు...కచ్చితంగా రెండో విడత దళిత బంధు నిద్ర సాధన కోసం నిరంతరం పోరాటం చేస్తామని దళితులకు న్యాయం చేస్తే కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని కడుపులో పెట్టి కాపాడుకుంటామని లేకపోతే ఊరురా దండోరా వేసి అయినా కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వానికి రాబోయే రోజుల్లో బుద్ధి చెబుతామని తెలిపారు.దళితుల అభివృద్ధిపై చిత్తశుద్ధి ఉంటే వెంటనే నిధులను విడుదల చేసి దళితులకు న్యాయం చేయాలని కోరారు లేకపోతే హైదరాబాదును వేల మంది లబ్ధిదారులతో బాధితులతో ముట్టడిస్తామని హెచ్చరించారు..ఈ కార్యక్రమంలో హుజురాబాద్ దళిత బంధు సాధన సమితి నాయకులు కొలుగూరి నరేష్, ఆకాష్, బిక్షపతి రమేష్ ఉదయ్ విజయ్ శ్రీకాంత్ రీటా సరిత అరుణ ,ప్రవీణ్ రాష్ట్ర నాయకులు ఆరెందుల కుమారస్వామి తదితరులు దళిత బంధు బాధితులు పాల్గొన్నారు

## జమ్మికుంట రైల్వే స్టేషన్ అభివృద్ధి .....

- ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన సమీక్ష ....
- అయోధ్య దర్శనానికి రైలు నడపడం గూర్చి....
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కు... వినతి

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట జనవరి 22...**



జమ్మికుంట పట్టణంలోని రైల్వే స్టేషన్లో దీర్ఘకాలిక సమస్యలు మరియు ట్రైన్ల నిలుపుదల కోసం మరియు అనేకమంది భక్తులు అయోధ్య దర్శన కోసం ఎదురుచూస్తున్న తరుణంలో ఒక రైలును నడిపించి భక్తులకు సౌకర్యం కల్పించాలని, అదేవిధంగా జమ్మికుంట పట్టణ కేంద్రంగా సుమారు 7000 మందికి ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన శిక్షణ పొందినా లబ్ధిదారులకు తో సమావేశం నిర్వహించాలని కోరగా పై కార్యక్రమాలు నిర్వహణకు హాజరుకావాలని కోరగా వచ్చే నెల పార్లమెంటు సమావేశాలు తరువాత తప్పకుండా వస్తానని హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో బిజెపి పట్టణ శాఖ అధ్యక్షుడు కొలకాని రాజు, బిజెపి ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల రాజేందర్ , బిజెపి నాయకులు పొన్నగంటి రవి కుమార్( పి జె ఆర్ ), గాండ్ల సంపత్ , చిర్యాల విజయ్ తదితరులు కలిశారు

## పాఠశాలల్లో క్రీడలు ప్రారంభం.

**కరపత్రం రామగిరి ప్రతినిధి, జనవరి 22.**




కమాన్ పూర్ మండలంలో వివిధ పాఠశాలల్లో విద్యార్థులతో క్రీడలను ప్రారంభించారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో ఎం పి పి ఎస్ రొంపికుంట పాఠశాలలో ఘనంగా ఆటల పోటీలు నిర్వహించారు. గణతంత్ర్య దినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న ఈ ఆటల పోటీలో విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు వేగోళం సత్యనారాయణ మాట్లాడుతూ తాము చదువుతో పాటు ఆటలకు కూడా ప్రాధాన్యం ఇస్తామని ఆటలు ఆడటం వల్ల విద్యార్థులు శారీరకంగా, మానసికంగా ఎదగడంతో పాటు క్రీడా స్ఫూర్తి, జట్టు స్ఫూర్తి, సోదర భావం, గెలుపు ఓటములన్నింటిని సమంగా భావిచడం వంటి భావనలు అభివృద్ధి చెందుతాయాన్నారు. ఈ ఆటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు గణతంత్ర్య దినోత్సవం రోజున ప్రత్యేక బహుమతులు అందిస్తామన్నారు. విద్యార్థులకు ఈ పోటీలను ఉపాధ్యాయులు నవత, సంతోష్, వనితలు అద్భుతంగా నిర్వహించారని తెలిపారు. ఈ క్రీడల్లో ఎంఈఓ విజయకుమార్ ఉపాధ్యాయులు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాపాలనను పక్కదోవ పట్టిస్తున్న మున్సిపల్ కౌన్సిలర్ కుమారుడు ములుగురు సదయ్య.....

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట జనవరి 22 ..**

కరీంనగర్ జిల్లా జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని ఆబాది జమ్మికుంటలో ప్రజా పాలన భాగంగా తెలంగాణ రాష్ట్రంలో నిన్న గ్రామాల్లో గ్రామసభలు పట్టణాలలో వార్డు సభలు సంబంధించిన అధికారులు నిర్వహిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రంలో ప్రజా పాలన లో భాగంగా ప్రజల వద్ద నుంచి అభివృద్ధి కార్యక్రమాలకు లబ్ధిదారుల ఎంపిక కొరకు వారి నుంచి దరఖాస్తు స్వీకరించడం జరిగింది, అందులో గృహమ్ లేని వాళ్ళు గృహం కోసం, రేషన్ కార్డు వాళ్ళు లేని వారు రేషన్ కార్డుకోసం,వివిధ పథకాల గురించి దరఖాస్తు స్వీకరించబడి ఉన్నవి. ఈరోజు , నిన్న గ్రామ సభల్లో వార్డు సభల్లో రేషన్ కార్డు లబ్ధిదారుల లిస్టు ఇందిరమ్మ ఇండ్ల లిస్టు ప్రకటించడం జరిగింది. జమ్మికుంట పురపాలక సంఘం పరిధిలో 14వ వార్డులో ఈరోజు గ్రామ సభ నిర్వహించడం జరిగింది,



ఈ కార్యక్రమంలో 14 వార్డు కౌన్సిలర్ భోగం సుగుణ కుమారుడు టిఆర్ఎస్ కార్యకర్త భోగం వెంకటేష్ అకారణంగా, అవివేకంగా సభ జరిగే బ్యానరును ఛీంపుతూ మురుగు మోరిలో వేసి తొక్కుతూ బూతు మాటలు మాట్లాడడం అది టిఆర్ఎస్ పార్టీకే చెందిందని, కాంగ్రెస్ పార్టీ బ్లాక్ బి అధ్యక్షులు మొలుగూరి సదయ్య ఖండించినారు. గత పది సంవత్సరాలు టిఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉండి ఒక డబుల్ బెడ్ రూమ్ గాని, ఒక నూతన రేషన్ కార్డు గాని ఇవ్వలేదు ఏం ముఖం పెట్టుకొని టిఆర్ఎస్ పార్టీ నాయకులు వార్డు సభ బ్యానర్లు చింపి బూతులు మాట్లాడుతున్నారు. హుజురాబాద్ నియోజకవర్గం లోని ప్రజలందరికీ నమస్కారం తో తెలియజేయునది ఏమనగా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చే ముందు ఏదైతే ఆరు గ్యారంటీలు ఇచ్చిందో ఆ గ్యారెంటీలను అమలుపరిచే బాధ్యత కూడా కాంగ్రెస్ పార్టీ లేద అని ఈ సందర్భంగా తెలిపినారు. ప్రజలు ఇందిరమ్మ గృహాల లబ్ధిదారుల లిస్టులో పేర్లు రాకుండా మరియు కొత్త రేషన్ కార్డు లిస్టులో పేరు రాకున్నా ఎవరు అయోమయానికి గురి కావాల్సిన అవసరం లేదు ఇందిరమ్మ ఇండ్లు,కొత్త రేషన్ కార్డులు నిరంతర ప్రక్రియ కాబట్టి రానివారు మళ్లీ అప్లై చేసుకోవాలని ఈ సందర్భంగా బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఒక ప్రకటనలో తెలిపినారు.

## ప్రతిపక్ష పార్టీ నాయకుల మాటల ఉచ్చులో పడకండి

**- ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందించడమే ఇందిరమ్మ సంక్షేమ రాజ్యం యొక్క లక్ష్యం..**
**- యూత్ కాంగ్రెస్ జమ్మికుంట మండల అధ్యక్షులు - బుడిగె శ్రీకాంత్**
**- మండల మరియు పట్టణ కేంద్రాలలో జరిగే గ్రామ సభలలో పాల్గొన్న జమ్మికుంట మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బుడిగె శ్రీకాంత్**

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట జనవరి 22.**

గ్రామ సభలలో లబ్ధిదారులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతిపక్ష నాయకుల మాయమాటలు నమ్మి మోసపోవద్దని, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మరో నాలుగు సంక్షేమ పథకాల అమలుకు శ్రీకారం చుట్టిందని అన్నారు. రైతు ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల విషయంలో నిజమైన లబ్ధిదారుల ఎంపిక మరియు పారదర్శకతకు ప్రాధాన్యతనిస్తూ, గ్రామసభల ద్వారా లబ్ధిదారులను గుర్తించడం జరుగుతుందనీ ప్రజలకు తెలియజేశారు. బి ఆర్ ఎస్ పది సంవత్సరాలలో జరగని అభివృద్ధి! తెలంగాణ ప్రజల ఆశీర్వాదంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో ఇందిరమ్మ సంక్షేమ ప్రజా పాలనలో, వచ్చిన సంవత్సరంలోనే అనేకమైన ప్రజారంజక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి, అర్హులైన కుటుంబాలకు ప్రతి పేద ఇంటికి సంక్షేమ ఫలాలు అందే విధంగా ప్రజా ప్రభుత్వం



పూర్తి బాధ్యత తీసుకుంటుందని ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. పది సంవత్సరాల పాలనలో ఏ ఒక్కరికి రేషన్ కార్డులు ఇవ్వకుండా నాటి బి ఆర్ ఎస్ ప్రభుత్వం కాలం వెల్లదీసిందని అనేక రకాల ఇబ్బందులకు గురిచేసిందని, కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అందరికి రేషన్ కార్డులతో పాటు లబ్ధిదారులకు ప్రతి పథకాన్ని అందజేయడానికి, పారదర్శకంగా అమలు చేయడానికి సిద్ధంగా ఉందని తెలియజేశారు.బి ఆర్ ఎస్ , బీజేపీ నాయకుల మాయ మాటలు నమ్మి అధైర్యపడవద్దని బుడిగె శ్రీకాంత్ ప్రజలకు భరోసా కల్పించారు. వారి వెంట యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి బిజీగిరి శ్రీకాంత్, కార్యదర్శి అజయ్, భాను, జావిద్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

**కరపత్రం రామగిరి ప్రతినిధి, జనవరి 22.**



ఎస్సీ ఎస్టీ సింగరేణి ఉద్యోగుల సంక్షేమ సంఘం 2025 నూతన సంవత్సర క్యాలెండర్ ను బుధవారం ఓసిపీ -1 కార్యాలయ ఆవరణలో పిఓ రాజశేఖర్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. కేంద్ర కమిటీ సభ్యులు ఇరుగురాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన నూతన క్యాలెండర్ ఆవిష్కరణలో పిఓ రాజశేఖర్ మాట్లాడుతూ సింగరేణి సంస్థ అభివృద్ధికి ప్రతి కార్మికుడు ఐక్యత తో ముందుకెళ్లాలని, ఈ నూతన సంవత్సరంలో కార్మికులందరూ కలిసికట్టుగా పనిచేసీ అధిక ఉత్పత్తి సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డివైజియం ఉదయ్ అర్జున్, సేఫ్టీ ఆఫీసర్ శ్రీనివాస్ రావు, పిఈ ఉదయ్ భాస్కర్, వెల్ఫేర్ ఆఫీసర్ సాయి కృష్ణ, గంగారపు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.